# లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు..!

- బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం
- బడానేతల సిఫార్సుకు పెద్దపీట అంటూ ప్రచారం
- ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులు 22,087

## తొలి విడతలో నియోజకవర్గానికి 300 మందికి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన బీసీకుల, చేతివృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం పంపిణీకి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 24 మందికి సాయం అందించగా, ఆ తర్వాత మరో 120 మందికి కూడా రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం దరఖాస్తులు 22,087 రాగా, తొలి విడతలో ప్రభుత్వం విడుదల చేయనున్న నిధులబట్టి ఒక్కో నియోజకవర్గానికి 300 మందికి సాయం అందించాలని భావిస్తున్నప్పటికీ, ప్రభుత్వం విడుదల చేసే నిధుల ఆధారంగా లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే దరఖాస్తులను పరిశీలన చేసిన అధికారులు అర్హుల జాబితాపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. భారీగా దరఖాస్తులు రావడం.. అర్హుల ఎంపిక చేయడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. దీంతో ఎవరికి ఆర్థిక సాయం దక్కనుందోనని ఆశతో దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.

◆ జిల్లాలో వివిధ నియోజకవర్గాల పరిధిలో వేలాది దరఖాస్తులు వచ్చాయి. సర్కారు మార్గదర్శకాల ప్రకారం ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్ల ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లి దరఖాస్తుల పరిశీలన చేశారు. తొలుత 250 మంది రూ.లక్ష ఆర్థిక సాయానికి అర్హులని అధికారులు గుర్తించారు. ఈ జాబితాపై కొందరు ప్రజాప్రతినిధులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. మరోమారు దరఖాస్తుల పరిశీలన చేయాలని అధికారులకు వారు సూచించినట్లు సమాచారం.

◆ **మార్గదర్శకాల ప్రకారమే..**

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఆర్థిక సాయం అందనుందని అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులను గుర్తించామని పేర్కొంటున్నారు. తొలి విడత ఆర్థిక సాయం పంపిణీకి చర్యలు చేపడుతున్నా.. వేలాది మంది దరఖాస్తుదారుల్లో ఎవరికి అదృష్టం వరిస్తుందోనన్న చర్చ సాగుతోంది.

◆ **సిఫార్సు చేసిన వారికే..**

లబ్ధిదారుల ఎంపిక జాబితాపై అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. ఓ వైపు ప్రజాప్రతినిధుల ఒత్తిడితో.. వారు సూచించిన పేర్లను తొలి విడత జాబితాలో పొందుపరిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేతలు సిఫార్సు చేసిన వారికే ఆర్థిక సాయం అందనుందన్న ప్రచారం సాగుతోంది. వేలాది దరఖాస్తుల్లో అర్హులను గుర్తించడానికి అధికారులు తీవ్రంగా శ్రమించినా జాబితాల రూపకల్పనలో నేతల ప్రమేయం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే లబ్ధిదారుల జాబితా రూపకల్పన ఇంకా కొలిక్కిరాలేదని తెలుస్తోంది.

## క్లుప్తంగా...

### అంకుషాపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు



అంకుషాపూర్‌లో సామూహిక సీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ స్వాతి

ఘట్‌కేసర్: మాతాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంకుషాపూర్‌లో తల్లిపాల వారోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాలతో బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం డీడీపీఓ స్వాతి మాట్లాడుతూ అపోహలు వీడి బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు. అనంతరం సామూహిక సీమంతం, అన్నప్రాసన నిర్వహించారు. ఉప సర్పంచ్ బాలమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంధ్య, సక్కుబాయి, టీచర్లు సుచిత్ర, విశాలి, బాలమణి, రజని, పద్మ పాల్గొన్నారు.

### ముదిరాజ్ సంక్షేమ భవనం పనులు షురూ



ఎదులాబాద్‌లో ముదిరాజ్ భవనం పనులు ప్రారంభిస్తున్న భద్రారెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో నిర్మిస్తున్న ముదిరాజ్ సంక్షేమ సంఘం భవనం అభివృద్ధికి మల్లారెడ్డి ట్రస్ట్ ముందుకొచ్చింది. సోమవారం గ్రామంలో ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలతో ముదిరాజ్ భవన స్లాబ్ పనులను మల్లారెడ్డి హెల్త్ సిటీ భద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ శంకర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, స్థానిక శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శంకర్, చిరంజీవిముదిరాజ్, లింగంముదిరాజ్, బాలరాజ్‌ముదిరాజ్, రాజుముదిరాజ్, ఆంజనేయులుముదిరాజ్, మహేశ్‌ముదిరాజ్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### పబ్లిక్ నల్లాలకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 9వ వార్డులో వైస్ చైర్మన్ మాధవరెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు మరమ్మతులు చేయించారు. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తాకి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న స్థానికుల వినతి మేరకు చెట్ల కొమ్మలు నరికివేస్తున్నట్లు చెప్పారు. అలాగే నీటి సరఫరా సాఫీగా జరిగేందుకు పబ్లిక్ నల్లాలకు మరమ్మతులు చేయించారు. రాందాస్, నజీర్, రాములు, హనుమంతు పాల్గొన్నారు.

### గౌడవెల్లిలో ఉచిత వైద్య శిబిరం



కర పత్రాలను అందజేస్తున్న సర్పంచ్

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ ప్రారంభించి మందులు పంపిణీ చేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన మెడికల్ ఆఫీసర్ గాయత్రీ దేవి ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. 100 మంది వరకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్యం పట్ల పాటించాల్సిన నియమాల కరపత్రాన్ని అందజేశారు. ఉపసర్పంచ్ పెంటమ్మ, వైద్యురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

### జైళ్లశాఖ ఉత్పత్తులు భేష్

కుషాయిగూడ: తెలంగాణ జైళ్ల శాఖ ఉత్పత్తులు భేష్ అంటూ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్ కితాబునిచ్చారు. పీపుల్స్ ప్లాజాలోని ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన జైళ్లశాఖ స్టాల్‌ను మంత్రులు ఎమ్మెల్సీ రమణతో కలిసి ప్రారంభించినట్లు జైళ్లశాఖ అధికారులు సోమవారం తెలిపారు. జైళ్లశాఖ ఉత్పత్తులపై అధికారులు వారికి వివరించారు. ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించిన వారు అభినందించినట్లు వెల్లడించారు. జైళ్లశాఖ ఐజీ రాజేష్, హైదరాబాద్ రేంజ్ డీఐజీ ఎస్.మురళీబాబు, చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్ల పర్యవేక్షణాధికారులు సంతోష్‌కుమార్ రాయ్, శివకుమార్, కళాసాగర్, శశికాంత్, పరశురాములు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 15న కలెక్టరేట్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను తిలకించేందుకు వచ్చే వారితో పాటు ముఖ్య అతిథి, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, కలెక్టరేట్ ఏఓ రామ్‌మోహన్, పోలీస్ అధికారులు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, సమస్యను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన దరఖాస్తుదారులు ప్రజావాణిలో పలు సమస్యలకు సంబంధించిన 102 అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల గార్డెన్ అనుమతులు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న పీఎస్‌రావునగర్ కాలనీవాసులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని పీఎస్‌రావునగర్ కమాన్ వద్ద పార్కింగ్ స్థలం లేకుండా కొనసాగుతున్న తిరుమలగార్డెన్ అనుమతులను రద్దు చేయాలని సోమవారం కాలనీవాసులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు సామల శ్రీనివాస్‌రెడ్డి, కందాడి చెన్నారెడ్డి, కార్తీక్‌గౌడ్, పాండాల యాదగిరిగౌడ్, మోర నరహరి రెడ్డి మాట్లాడుతూ పీఎస్‌రావునగర్ కమాన్ వద్ద గల తిరుమల గార్డెన్‌లో మూడేళ్లుగా నిర్వహిస్తున్న వివాహ కార్యక్రమాలు, వివిధ శుభకార్యాల వ్యర్థాలను గార్డెన్ చుట్టూ పారేస్తున్నారని, ఈ వ్యర్థాలను కుక్కలు, పందులు ఇళ్ల సమీపంలోకి తీసుకువస్తున్నాయని వాపోయారు. దోమలు, ఈగలు, వ్యర్థాలతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తిరుమల గార్డెన్ అనుమతులను రద్దు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కందాడి జైపాల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, నాగమల్లారెడ్డి, రవికిరణ్ రెడ్డి, శ్రావన్‌రెడ్డి, అరవింద్‌గౌడ్, మాదిరెడ్డి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే గిరిజన, ఆదివాసీలకు న్యాయం

సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కీసర: గిరిజన, ఆదివాసీలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. కీసరలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఎస్టీ సెల్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు గిరిజన, ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. గిరిజనులు, ఆదివాసీల మధ్య గొడవలు పెట్టి వారికి దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కనీయకుండా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గిరిజనులు, ఆదివాసీలకు అన్నిరంగాల్లో న్యాయం చేస్తామన్నారు. ఇందుకోసం గిరిజనులు, ఆదివాసీలంతా ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. కాంగ్రెస్ ఎస్టీసెల్ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు నానావత్ సురేష్, మేడ్చల్ జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు గణేష్‌నాయక్, బీబ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, నేతలు ఆకాష్‌నాయక్, పాండునాయక్, విజయ్‌నాయక్, సైదానాయక్, నర్సింగ్, రామవత్‌చందర్, రవినాయక్, సుమన్‌నాయక్, మల్లికార్జున్‌నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

శామీర్‌పేట్: కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ తూముకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తూముకుంట మున్సిపాలిటీలో జైపాల్‌రెడ్డి అధ్యక్షతన అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తూముకుంట మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్‌గా రాంచందర్‌యాదవ్, అధికార ప్రతినిధిగా మల్లేస్‌యాదవ్, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా గురుప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దుర్గయ్య, సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ జెడ్పీటీసీ బాలేష్, 4వ వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



తూముకుంటలో కాంగ్రెస్ సమావేశం

## నిలిచిపోయిన పనులపై అడిషనల్ కలెక్టర్‌కు వినతి



అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ యార్డు పనులు, రాంపల్లిలో చేపట్టిన శ్మశానవాటిక అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోయాయని, పనులను త్వరగా పూర్తిచేయించాలని కోరుతూ సోమవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాంపల్లి మాజీ ఉపసర్పంచ్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్కు అభివృద్ధి పనులు ప్రారంభం



అన్నమయ్య కాలనీలో పార్కు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నమయ్య కాలనీలో మున్సిపల్ నిధులు వెచ్చించి చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, స్థానిక కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న పార్కులను అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ నిధులను వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, డీఈ సుదర్శన్, కాలనీ అధ్యక్షుడు గడ్డమీద రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాయకులు కృష్ణారెడ్డి, అంజయ్య, రామ్మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో జోరుగా అభివృద్ధి పనులు



దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: కోట్ల రూపాయలు వెచ్చించి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 12, 9, 6, 5, 4 వార్డుల్లో సుమారు రూ.1.90 కోట్ల నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డుకు సమీపంలో ఉన్న దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే సుమారు రూ.8 కోట్ల మేర నిధులతో స్ట్రామ్‌వాటర్ వెళ్లే విధంగా పైప్‌లైన్ల పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అహ్మద్‌గూడ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ యార్డును కూడా నిర్మించినట్లు చెప్పారు. అదేవిధంగా దమ్మాయిగూడ ప్రధాన రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, డీఈ చిరంజీవులు, మేనేజర్ వెంకటేషం, కౌన్సిలర్లు కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, అనురాధ, వెంకటేష్, స్వప్నహరిగౌడ్, మౌనిక నరహరి, నానునాయక్, హేమలత, కో ఆప్షన్‌సభ్యులు రజిని, బీఆర్ఎస్ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చీర్యాలలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు

### చీర్యాల గ్రామంలో సీసీ రోడ్డు

కీసర: మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులను వెచ్చించి గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీరోడ్లు వేయిస్తుండటం అభినందనీయమని ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్ అన్నారు. సోమవారం చీర్యాల గ్రామంలో మంత్రి మల్లారెడ్డి సొంత నిధులు రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ నుంచి ప్రధాన రహదారి వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ తుంగ ధర్మేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, పీఏసీఎస్ సభ్యుడు రామిడి శ్రీనివాస్ రెడ్డి, వార్డుసభ్యులు, గ్రామనేతలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



మొక్కలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: హరితహారంలో భాగంగా జవహర్ నగర్ కార్పొరేటర్ 8వ డివిజన్ సంతోష్‌నగర్‌లో సోమవారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారంతో రాష్ట్రమంతా పచ్చదనంతో కనిపిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీమన్నారాయణ, నర్సింహగౌడ్, భారతి, బిందు, ప్రియ, హిమజ, శశికళ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు



అవుషాపూర్‌లో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పద్మజరాణి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా డీఆర్‌డీఏ పద్మజారాణి హాజరై ఏనుగు సంగీతరెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి వాటర్ ఫిల్టర్‌ను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో మండల ప్రజలకు వైఎస్సార్ ట్రస్ట్ సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కావేరి, మశ్చేందర్‌రెడ్డి, సదానంద్‌రెడ్డి, రఘుమారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

- కారును ఢీకొన్న కంటైనర్
- వ్యక్తికి తీవ్ర గాయాలు

కీసర: కీసర ఓఆర్ఆర్‌పై కంటైనర్ లారీ, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కీసర పోలీసుల వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం మేడ్చల్‌కు చెందిన ధర్మతేజ(32) తన కారులో మేడ్చల్ నుంచి కీసర మీదుగా ఘట్‌కేసర్ వైపు వెళ్తుండగా కీసర జంక్షన్ సమీపంలో కంటైనర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ నడుపుతూ కారును వేగంగా ఢీకొట్టి కొద్ది దూరం వరకు లాక్కెళ్లాడు. ఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న ధర్మతేజ(32)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత కంటైనర్ డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా లారీని పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ధర్మతేజ షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు కుమారుడిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

## గద్దర్‌కు ఘన నివాళి



నాగారంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి



నాగారంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

ప్రజాగాయకుడు గద్దర్ పాటగా అందరి గుండెల్లో బతికే ఉంటుందని పలువురు కొనియాడారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శమని, తరాలకు ఆయన గుర్తుంటారని కీర్తించారు. సోమవారం పలు ప్రాంతాల్లో గద్దర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన భౌతిక ఖాయాన్ని సందర్శించేందుకు ఆయా ప్రాంతాల నుంచి పెద్దఎత్తున అల్వాల్‌కు బయలుదేరారు. ఎల్బీ స్టేడియం నుంచి సాగిన అంతిమ యాత్రలో మేడ్చల్‌వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్లు



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు



అన్నోజిగూడలోని ఫ్లైఓవర్ వద్ద నివాళులర్పిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శంకర్‌రెడ్డి